13న వాజీ రంగోలీ పోటీలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సనాతన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందజేయడమే లక్ష్యంగా వాజి ఛానల్ గత 28 సంవత్సరాలుగా రంగోలి పోటీలను నిర్వహిస్తూ వస్తోందని వాజీ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతి నీడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఉదయం వాజీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 13వ తేదీన ఆనందగజపతి ఆడిటోరియంలో రంగోలి పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ఏడాది రంగోలీ పోటీలలో 4 లక్షల 50 వేలరూపాయల విలువగల బహుమతులను విజేతలకు అందించనున్నామని తెలిపారు. ఈ పోటీలలో ముగ్గు వేసే ప్రతి ఒక్కరికి పలు బహుమతులు అందించనున్నామని అన్నారు. బహుమతి ప్రదానోత్సవంలో ప్రముఖ టీవీ ఆర్టిస్ట్ పూజ(గుండమ్మ కథ ఫేం) పాల్గొననున్నారని అన్నారు. విజయనగరంలో మహిళలను ప్రోత్సహించేందుకు, వారిలో నిబిడీకృతంగా ఉన్న శక్తి సామర్ధ్యాలను వెలికితీసేందుకు గడిచిన 28 ఏళ్లుగా వాజీ నిర్వహిస్తున్న రంగోలీ పోటీలలో ఇప్పటి వరకు సుమారు 15 వేల మంది పాల్గొన్నారని అన్నారు. 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆనందగజపతి ఆడిటోరియంలో వాజీ రంగోలీ, హౌసీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని అన్నారు. డిసెంబర్ 31వ తేదీన వాజీ మెగా హౌసీలో ఫుల్ హౌసీ అయి, పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు నేరుగా ఆనందగజపతి ఆడిటోరియంలో జరిగే బహుమతి ప్రదానోత్సవానికి హాజరు కావాలని సూచించారు.

సంక్రాంతి సందర్భంగా స్పందన రద్దు : డిఆర్వో అనిత

విశాలాంధ్ర-విజయనగరం: మకర సంక్రాంతి సందర్భంగా 15వ తేదీ సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగే స్పందన- జగనన్నకు చెపుదాం కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత ఒక ప్రకటన లో తెలిపారు.

బిందు సేద్యంతో వచ్చే లాభాలను రైతులు గుర్తించాలి

ఈఏడాది జామి మండలానికి రూ.22,90లక్షలు మంజూరు

ఎపిఎంఐపి పిడి లక్ష్మీనారాయణ వెల్లడి

విశాలాంధ్ర-జామి: బింధు సేద్యంతో రైతులకు అనేక లాభాలు వున్నాయని, ఈ విషయాన్ని గుర్తిస్తే రైతులు సాగుకు మరింత ఉపయోగపడేలా ప్రభుత్వం యూనిట్లును రాయితీపై పంపిణీ చేస్తుందని ఎపిఎంఐపి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పిఎన్వి.లక్ష్మీనారాయణ తెలిపారు. జామిమండలంలోని అలమండలో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రిప్ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ జామి మండలానికి సంభందించి 40 హెక్టార్లలో ఉపయోగపడేలా డ్రిప్ యూనిట్లును మంజూరు చేయడం జరిగిందన్నారు. అందుకు రూ.22.90లక్షలను ప్రభుత్వం వివిద రాయితీతో మంజూరు చేసిందన్నారు. డ్రిప్ యూనిట్ వలన సాగునీటి ఆదాతోపాటు, అధిక పంట దిగుబడి ఉంటుందన్నారు. ఇసుక నేతలు, ఎగుడు దిగుడు నేతలను సైతం సాగులోనికి తీసుకువరావచ్చున్నారు. విద్యుత్ పొదుపు, అన్ని రకాల పొలం పనులకు కూలీల ఖర్చులు తగ్గుతాయన్నారు. పోషక పదార్థాలు, రసాయనిక ఎరువులు,నీటి ద్వారా మొక్క వేళ్ళ దగ్గరకు నేరుగా ఇవ్వడం వలన ఎరువుల వినియోగ సామర్థ్యం మరింత పెరుగుతుందన్నారు. అలాగే తమకున్న పొలాన్ని బట్టి రైతులు స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రం వద్దకు వచ్చి వివరాలు తెలుసుకోవచ్చున్నారు. ఏఏ పథకాలకు ఎంత రాయితీ వస్తుందో, ఏవిదంగా పనితీరు ఉంటుందో పరిశీలన చేసుకోవచ్చున్నారు.

సంక్రాంతి పేరుతో కోడిపందేలు, పేకాట ఆడితే కఠినచర్యలు : సిఐ ఉపేంద్ర

విశాలాంధ్ర-చీపురుపల్లి : సంక్రాంతి రోజులలో సాంప్రదాయ క్రీడలు అనే పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవు అని చీపురుపల్లి నియోజకవర్గం ప్రజలకు సిఐ ఉపేంద్రరావు హెచ్చరించారు. అలాగే కోడిపందాలు, పేకాట నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం అని, జూదం అనే వ్యసనం ప్రజల యొక్క జీవితాలను నాశనం చేస్తుంది అని, అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించమని అన్నారు. కోడి పందాలు, కోడి కత్తులు తయారీదారులు పేకాట, నిర్వహకులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గంలో పండుగ ముగింపు వరకు గట్టి నిఘా ఉంచడం జరుగుతుందని ఇ నియోజకవర్గ ప్రజలు ఎవ్వరూ ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్ద అన్నారు. ఒక్కసారి కేస్ నమోదు చేస్తే మీ జీవితమే నాశనం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో గరివిడి ఎస్ఐ దామోదర్ రావు. మెరకముడిదం ఎస్ఐ నవీన్ పాడల్. చీపురుపల్లి ఎస్ఐ కె కె నాయుడు.గుర్ల ఎస్ఐ భాస్కర్ రావు పాల్గొన్నారు.

అప్పు కాదు...ఆత్మ గౌరవం

కలెక్టర్ నాగలక్ష్మి

14,857 మందికి జగనన్న తోడు విడుదల

విశాలాంధ్ర- విజయనగరం: జగనన్న తోడు పథకం ద్వారా ఇస్తున్న రూ.10వేలు అప్పు ద్వారా చిరు వ్యాపారుల్లో ఆత్మ గౌరవాన్ని పెంచుతున్నారని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొనే వారికి ఈ పథకం ఎంతగానో ఆదుకుంటోందని ఆమె ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డికి వివరించారు. జగనన్న తోడు పథకం క్రింద 8వ విడతగా జిల్లాలోని సుమారు 14,857 మంది లబ్దిదారులకు, రూ.15.71 కోట్ల వడ్డీ లేని రుణాన్ని ముఖ్యమంత్రి గురువారం విడుదల చేశారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి నేరుగా బటన్ నొక్కి ఈ మొత్తాన్ని లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశారు. అలాగే జగనన్న తోడు పథకం క్రింద 6వ విడతలో రుణం తీసుకున్న 26,320 మంది లబ్దిదారులకు రూ.54.94లక్షలను వడ్డీ క్రింద లబ్దిదారులకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారంలో, కలెక్టర్ నాగలక్ష్మి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డితో మాట్లాడుతూ, జిల్లాలో ఈ పథకం క్రింద లబ్దిదారులకు జరిగిన మేలును వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో ఏడు విడతల్లో సుమారు 1,06,696 మంది చిరువ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు రూ.10వేలు నుంచి రూ.13 వేలు మధ్య దాదాపు రూ.101.12 కోట్లు వరకు వడ్డీలేని రుణాలను మంజూరు చేశామని తెలిపారు. అలాగే ఇలా రుణాలు పొందిన 1,34,867 మంది చిరువ్యాపారులకు వారి బ్యాంకు ఖాతాల్లో రూ.3.08 కోట్లను వడ్డీ క్రింద ఐదు విడతల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. చిరు వ్యాపారులకు ఎటువంటి పూచికత్తు లేకుండా, అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ నేరుగా ఈ రుణాలను మంజూరు చేయడం జరుగుతోందని కలెక్టర్ వివరించారు. లబ్దిదారులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఇన్‌ఛార్జి డాక్టర్ తలే రాజేష్, డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పిడి సుధాకరరావు, సచివాలయాల నోడల్ ఆఫీసర్ నిర్మలాదేవి, డిఆర్‌డిఏ సిబ్బంది, లబ్ధదారులు పాల్గొన్నారు.

బతకడం చాలా సులువు

- జమ్ము గౌరి, జగనన్న తోడు లబ్దిదారు

ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి పరిపాలనలో సామాన్యు లు బ్రతకడం చాలా సులువు అయిపోయిందని, జగనన్న తోడు లబ్దిదారు జమ్ము గౌరి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో బ్రతుకు చాలా దుర్భరంగా ఉండేదని, అన్నింటికీ ఇబ్బంది పడే వాళ్లమని చెప్పారు. ఆమె జిల్లా నుంచి నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడుతూ, ఈ నాలుగున్నరేళ్లలో తనకు జరిగిన లబ్దిని, సామాజికంగా వచ్చిన మార్పును వివరించారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న పథకాలు, పేదలు, సామాన్య ప్రజలకు వరంగా మారాయని, ప్రతీ ఇంటికి రూ.2లక్షలు నుంచి రూ.3 లక్షలు వరకు లబ్ది చేకూరిందని చెప్పారు. జగనన్న తోడు పథకం క్రింద తాను రూ.10వేలు రుణం తీసుకొని, కుట్టుమిషన్ కొనుక్కొని నెలకు సుమారు రూ.7వేలు వరకు సంపాదిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నానని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ఎంతో గొప్పదని, దాని ద్వారా అర్హత ఉంటే చాలు ఇంటికే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందుతున్నాయని కొనియాడారు. ఆరోగ్యశ్రీ పథకం క్రింద తన తండ్రికి గుండె ఆపరేషన్ చేయించి ప్రాణాలు నిల బెట్టారని చెప్పారు. తామంతా ఎంతో ధైర్యంగా బ్రతుకుతున్నామని అన్నారు. నవరత్నాలు తమలాంటి పేదవాళ్లను ఎంతగానో ఆదుకున్నాయని, తనకు ఇళ్లు కూడా మంజూరయ్యిందన్నారు. ఏ కష్టం వచ్చినా జగన్ మోహనరెడ్డి దేవుడిలా పేద ప్రజలను ఆదుకుంటున్నారని కొనియాడారు. జగనన్న పాలనలో ఉచితంగా చక్కని విద్య, వైద్యం, ఇళ్లు, ఇంటింటికీ పథకాలు అందుతున్నాయంటూ గౌరి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

రాయుడు పేటలో తాగునీటికి ఇక్కట్లు

- ఇంటింటా కుళాయిలు ఏర్పాటులో వివక్షత
- పట్టించుకోని అధికారులు గుత్తేదారు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు రాయుడుపేట గ్రామస్తులను తాగునీటి కష్టాలు పట్టిపీడిస్తున్నాయి. జలజీవన్ మిషన్ నిధులతో గ్రామంలో ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ గుత్తేదారు గ్రామంలో కొన్ని వీధులకు కొళాయిలు వేసి,రెండు వీధులకు ఇంటింటి కొళాయిలు వేయకపోవడంపై ఆయా వీధులకు చెందిన మహిళలు పెదిరెడ్ల కృష్ణవేణి, లంక లక్ష్మి,పెది రెడ్ల చిన్నమ్మలు బెహర సత్యవమ్మ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పథకం ద్వారా అందించే మంచినీటి సరఫరా లోనూ వివక్షత చూపడం తగదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కొళాయిలు ఏర్పాటుపై సంబంధిత రక్షిత మంచినీటి పథకం అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోలేదని గుత్తేదారుకు చెప్పినప్పటికీ గుత్తేదారు కొళాయిలు ఏర్పా టు చేయడంపై పెడచెవున పెట్టడం దారుణమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగం ఉన్నత అధికారులు దృష్టి సారించి మండల అధికారులపై ఒత్తిడి తెచ్చి ఇంటింటి కొళాయిలు వేయని వీధులకు తక్షణమే కొళాయిలు వేసేలా చర్యలు చేపట్టి తాగునీటి కష్టాలు తీర్చాలని ఆయా వీధులకు చెందిన మహిళలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఆశాజనకంగా మొక్క జొన్న పంట

ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో రబీ సీజన్లో వేసిన మొక్కజొన్న పంట ఆశా జనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలో 56 హేక్టర్‌లో రైతులు సాగుచేస్తున్నారు. ముఖ్యంగా అధికంగా చినభంటుపల్లి, ఇప్పలవలస, సోమలింగాపురం, మెరకముడిదాం, గర్భాం గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్నారు. ఖరీఫ్‌లో పంట పూర్తిగా పోయినప్పటికీ రబీలో కాస్తా ఆశా జనకంగా ఉండటం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో చేతికందే పరిస్థితి వుంది. మార్కెట్ లో క్వింటా జొన్నలు 2,000 నుండి 2,200 ధర పలుకుతుంది. అందువలన కాస్తా రైతుకు ఊరట లభించే అవకాశం వుంది. ఏది ఏమైనా మొక్క జొన్న పంట ఆశా జనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పవచ్చు.

అంగన్వాడీల వర్కర్ల సమ్మెకు లోకం మాధవి మద్దతు

విశాలాంధ్ర-భోగాపురం: అంగన్వాడి కార్యకర్తల 61 వ రోజు సమ్మెకు జనసేన నెల్లిమర్ల ఇంచార్జి లోకం మాధవి మద్దతు తెలిపారు. గురువారం ఆమె సమ్మె చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలను కలిసి మద్దత్తు తెలుపుతూ అంగన్వాడి వర్కర్ల సమ్మె పోరాట నిధికి తన వంతు సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తల పట్ల ప్రభుత్వం మొండివైఖరి చాలా దారుణమన్నారు. అంగన్వాడి సమ్మె 61వ రోజుకి చేరిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచమంటే ఎస్మా చట్టాన్ని ప్రయోగించి ఉద్యోగాలు తీసేస్తామని బెదిరింపులు దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా జీతం పెంచమని అంటుంటే ఎందుకు అంత దారుణంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. పనిచేసే ప్రతి ఒక్కరికి కనీస వేతనం అమలు చేయాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు చేస్తున్న న్యాయపోరాటానికి జనసేన పార్టీ మద్దతుగా ఉంటదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు జనసైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

ఏఐటియుసి నేతృత్వంలో మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల పోరాటం విజయవంతం

ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రంగరాజు, బుగత అశోక్ లు హర్షం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రాష్ట్రంలో ఉన్న మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకి ఎన్నకల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి నేతృత్వంలో గత 6 రోజులుగా చేస్తున్న సమ్మె పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి అంగీకరించడంతో కార్మికుల సమ్మె పోరాటం ద్వారా విజయం సాధించారని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం సిపిఐ జిల్లా కార్యాలయం అమర్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించిన వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో 2024 జనవరి 3 వ తేదీ నుంచి కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించుకోవడానికి సమ్మె ఒక్కటే సరైన మార్గమని ఎఐటియుసి రాష్ట్ర వ్యాపితంగా సమ్మె పోరాటానికి పిలుపునివ్వడం జరిగింది. సమ్మె కొనసాగుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఫలు దఫాలు చర్చలు జరిపిన తరువాత ప్రస్తుతం ఇస్తున్న 15,000 వేలు జీతాన్ని 21,000 వేలుకి బేసిక్ వేతనంగా పెంచి ఇవ్వడానికి అంగీకరించారని తెలిపారు. డ్రైవర్లు కి 18,500 నుంచి జీ.ఓ నెంబర్ 7 ప్రకారం 6000 కలిపి 24,500 పెంచడానికి అంగీ కరించారని అన్నారు. ప్రమాద సాత్తూ మరణించిన కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న 5 లక్షల నుంచి 7 లక్షలు ఎక్స్‌గ్రేషియా పెంచి ఇవ్వడానికి అంగీకరించారని తెలిపారు. మరణించిన, రిటైరైన కార్మికుల పిల్లలకే ఉద్యోగాలు ఇవ్వడానికి అంగీకరించారు. సరెండర్ లీవ్స్ వారం రోజుల్లో చెల్లిస్తామని తెలిపారు. క్లాప్ వెహికల్ డ్రైవర్స్ సమస్యలతో పాటు ఇంకా మిగతా పెండింగులో ఉన్న సమస్యలు అన్ని పరిష్కారంచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఇంకా సమాన పనికి సమాన వేతనం, క్రమబద్ధికరణ హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. ఈరోజు నుంచి మున్సిపల్ కార్మికులు అందరూ విధుల్లోకి హాజరవుతున్నారనీ తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు చేసిన పోరాటానికి మద్దత్తు తెలిపిన రాజకీయ పార్టీలకి, ప్రజాసంఘాలకి, ప్రజలకి, మీడియా మిత్రులకు పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జలగడుగుల కామేష్, జిల్లా ఉపాధ్యక్షులు తుపాకుల శ్రీను, దలయ శ్రీను, సహాయ కార్యదర్శులు కళ్యాణం శ్రీను, పొట్నూరు కిషోర్, క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొడుగు రామకృష్ణ, దశమంతుల సత్తిబాబు, కోడూరు చిరంజీవి, దశమంతుల గణేష్, మరిపల్లి ధన మరియు కార్మికులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎండీఓ

విశాలాంధ్ర -తెర్లాం: మండల కేంద్రంలో గురువారం ఎండిఓ సంబంగి రామకృష్ణ చేతుల మీదుగా విశాలాంధ్ర-2024 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. తన తో పాటు సూపరింటెండెంట్ అప్పారావు, తెర్లాం పోలిస్టేషన్ నుంచి హెడ్ కానిస్టేబుల్ దాసు, విద్యాశాఖ నుంచి తెర్లాం 2 ఎంఈఓ పాపారావు, కూనాయవలస సర్పంచ్ విజయబాబు, మాజీ ఎం పి టి సి సత్యంనాయుడు మరియు పలువురు మండల స్థాయి అధికారులు, సర్పంచ్ లు, సెక్రెటరీ లు విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ దేశంలో కన్స్ట్రక్షన్ ఉద్యోగావకాశాలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఇజ్రాయెల్ దేశంలో కన్స్ట్రక్షన్ సెక్టార్లో ప్లాస్టరింగ్ వర్క్, సిరామిక్ వర్క్, బిల్డింగ్ ఫ్రేంవర్క్, రాడ్‌బెండింగ్ లో ఉద్యోగాలు పొందేందుకు జిల్లాలోని 8వ తరగతి ఆపైన చదివి నైపుణ్యం కలిగిన అభ్యర్థులు ఏపీ ఎస్ ఎస్ డి సి ఇన్ హెూమ్ ఆన్లైన్ ప్రోగ్రాం రిజిస్ట్రేషన్ వెబ్ సైట్ నందు అప్లయ్ చేసుకోవలెను . ఈ యొక్క కన్స్ట్రక్షన్ సెక్టార్లో వర్క్ చెయ్యడానికి 21 సంవత్సరం నుండి 45 సంవత్సరాలు మినిమం 3సంవత్సరాలు అనుభవం కలిగిన అభ్యర్థులు అర్హులు .కావున ఆసక్తి కలిగిన వారు అప్లయ్ చేసుకోవలెను అని జిల్లా నైపుణ్యా భివృద్ధి అధికారి యూ.సాయి కుమార్ తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబరు 7997299739 సంప్రదించాలని కోరారు.

కూరగాయలు షెడ్డు పనులు పూర్తి చేయండి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలో గల పెదబొండపల్లి గ్రామం మధ్యలో పార్వతీపురం కు వెళ్లే ప్రధాన రహదారి మలుపు దగ్గర కూరగాయలు మార్కెట్ ఉన్నందున సాయంత్రం వేళ చాలా రద్దీగా ఉంటుందని ఆ సమయంలో పక్కనే ఉన్న జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు బస్సు ఆటోల కోసం సెంటర్లో ఎదురు చూడటం ఆ సమయంలో వచ్చే పెద్ద వాహనాలు వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని క్వారీకి వెళ్లే టిప్పర్ లారీలు ట్రాక్టర్లు ఈ రోడ్డుపైనే తిరగడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కావున సంబంధిత అధికారులు పక్కనే ఉన్న కూరగాయలు షెడ్ పనులు పూర్తి చేసి కూరగాయలు మార్కెట్‌షెడ్ లో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

13 నుండి 16వ తేదీ వరకు పింఛనుదారుల భవనంలో లైఫ్ సర్టిఫికేట్ జరపబడవు

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం సబ్ ట్రెజరీ పరిధిలో గల పింఛనుదారులందరికి స్థానిక రైతుబజార్ సమీపంలో ఉన్న పార్వతీపురం మన్యం జిల్లా ప్రభుత్వ పింఛనుదారుల సంఘ భవనంలో లైఫ్ సర్టిఫికేట్ చేస్తున్నామని సంఘ కార్యదర్శి దొడ్లంకి గణపతిరావు తెలిపారు. అయితే మకర సంక్రాంతి సందర్భంగా ఈనెల 13వ తేదీ నుండి 16వ తేదీ వరకు పార్వతీపురం పింఛనుదారుల భవనంనందు లైఫ్ సర్టిఫికేట్ చేయుటకు శెలవులుగా ప్రకటించడమైనదని కావున పై శెలవు దినములలో పింఛనుదారులు ఎవరు రావద్దని ఈసందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

హత్యకేసులో వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష

విశాలాంధ్ర-బెలగాం: హత్య కేసులో ఓ వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటూ, రూ.500 జరీమానాను విధిస్తూ పార్వతీపురం రెండవ అదనపు జిల్లా జడ్జి దామోదరరావు గురువారం తీర్పు వెలువరించారని పార్వతీపురం కోర్టు ఎస్ఐ ఎస్. షణ్ముఖరావు తెలిపారు. 2018 వ సంవత్సరం ఫిబ్రవరి 22వ తేదీన సీతానగరం మండలం ఆర్. వెంకంపేట గ్రామానికి చెందిన గులిపల్లి ఈశ్వరరావు తన భార్య గులిపల్లి సత్యవతిని పీకనొక్కి చంపాడని 23వ తేదీన అదే గ్రామానికి చెందిన పెంట రాములు సీతానగరం పోలీసుస్టేషన్ లో అదే సంవత్సరం 23వ సంవత్సరంలో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అప్పటి బొబ్బిలి సిఐ విడివి ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసును పిపి బడే వెంకట నాయుడు వాదించారు. నేరం రుజువు కావడంతో పార్వతీపురం రెండవ అదనపు జిల్లా జడ్జి దామోదరరావు ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తూ రూ. 500లు జరీమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో సాక్షిగా ముద్దాయి కుమార్తె ఉండడం విశేషం. కేసులో మరో ఇద్దరు ముద్దాయి తల్లి, సోదరుడు గౌరమ్మ, సత్యనారాయణలపై అభియోగాలు కోర్టు కొట్టివేసింది.

జిల్లాలో 7460 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.7.59 కోట్లు జగనన్న తోడు నగదు జమ

విశాలాంధ్ర-పార్వతీపురం: జగనన్న తోడు పథకం ద్వారా చిరు వ్యాపారులు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారికి అండగా నిలిచి పేదల ఇంట సంతోషం వెల్లివిరియాలన్నదే ప్రభుత్వ ఆశాయమని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లి తన క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి నేరుగా లబ్దిదారుల ఖాతాలకు నగదు జమ చేశారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా స్వయం ఉపాధి వృద్ధి చెందేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తూ అధిక వడ్డీల బారిన పడకుండా వరుసగా 8వ విడత జగనన్న తోడు పథకం క్రింద ఒక్కొక్కరికి రూ.10 వేలు, అంతకు పైన రూ.13 వేల వరకు వడ్డీ లేని రుణాలు ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. సకాలంలో రుణాలు చెల్లించిన చిరు వ్యాపారులు బ్యాంకులకు చెల్లించిన వడ్డీని ఆరు నెలలకోసారి ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. జగనన్న తోడును సద్వినియోగం చేసుకొని జీవన వికాసానికి దోహదపడాలని అన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జగనన్న తోడు పథకం క్రింద జిల్లాలోని 7460 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.7.59 కోట్లు నగదు జమ కానున్నట్లు తెలిపారు. కురుపాం నియోజక వర్గంలో 1864 మంది లబ్ధిదారులకు రూ.కోటి 95 లక్షల 28 వేలు, పాలకొండ నియోజక వర్గంలో 1896 మందికి కోటి 92 లక్షల 27 వేలు, పార్వతీపురం నియోజక వర్గంలో 1914 మందికి కోటి 92 లక్షల 79 వేలు, సాలూరు నియోజక వర్గంలో 1786 మందికి కోటి 78 లక్షల 60 వేలు చొప్పున అందజేసినట్లు తెలిపారు. అనంతరం నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్. కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేద గిరిజన రైతులకు మంత్రి, డిప్యూటీ సీఎం రాజన్నదొర పోడు పట్టాలను పంపిణీ

విశాలాంధ్ర-మక్కువ: మండలంలో గురువారం భగవాన్ మండపం వద్ద మక్కువ మండలం కేంద్రంలోని గిరిజన శాఖ మంత్రి డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర ఆధ్వర్యంలో పేదల గిరిజన రైతులకు పోడి పట్టాలను పంపిణీ చేశారు రాష్ట్రంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకి ఎంతో మేలు చేస్తున్నారు 22 ఏ ప్రకారం జీవో ప్రకారం డి పట్టా భూములను గిరిజన ప్రజలకు సొంత భూములుగా పట్టాలు పంపిణీ చేశారు రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి మక్కువ మండలంలో 712 ఎకరాల భూమిని 733 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు ఈ ఘనత మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో అభివృద్ధి బాటలు ముందడుగు వేస్తున్నారు ఇచ్చిన మాట నవరత్నాలు భాగంగా 80శాతం వరకు నెరవేర్చారు గడపగడపకు మన ప్రభుత్వం 211 రోజులు విజయవంతంగాపూర్తి చేసుకున్నారు ప్రజలతో కలిసిపోయి వాళ్ళ కష్టాలను బాధలను విన్నారు డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 2024 లో మళ్లీ సీఎం కావాలి అతనికి మీ ఆశీస్సులు ఉండాలని ప్రజల్ని గెలిపించాలని అన్నారు అభివృద్ధి చేయాలి అంటే సీఎం జగన్మోహన్ రెడ్డి వల్ల సాధ్యమని కొనియాడారు ఈ కార్యక్రమంలో గిరిజన శాఖ మంత్రి డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర మక్కువ జడ్పిటిసి మావుడి శ్రీనివాస్ నాయుడు వైసీపీ మండల అధ్యక్షులు మావుడి రంగునాయుడు ఎంపీపీ మర్రి పారమ్మ ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ, తాసిల్దార్ సూర్యనారాయణ ఉన్నతాధికారులు సర్పంచులు ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు ముఠా కేంద్రంగా రైస్ మాఫియా...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యానికి తూట్లు...

రీసైక్లింగ్ తో దగాపోతున్న గిరిజనం

విశాలాంధ్ర-కురుపాం: అండగా అధికారయంత్రాంగం ఉంటూ సహకరిస్తే నిబంధనలకు వ్యతిరేకంగా ఏవ్యాపారం చేసినా బెదురేలేదన్నట్లుగా ఉంది మన్యంలో తూర్పుముఠా కేంద్రం మొండెంఖల్ తదితర ప్రాంతాల్లో...కేంద్ర ,రాష్ర ప్రభుత్వాలు లక్షల కోట్లు వెచ్చించీ నిరుపేదలకు అందిస్తున్న పిడిఎస్ బియ్యం బహిరంగంగా పక్కరాష్ట్రం ఒరిస్సాకు తరలిస్తూ చట్టవ్యతిరేక వ్యాపారాలు యదేచ్చగా సాగిస్తున్నారు.పేదలకు రూపాయికి అందించే బియ్యంను డిమాండ్ బట్టీ రూ12బి15మద్య లబ్దిదారులనుంచి కొనుగోలు చేసీ సమీపంలోని ఒరిస్సాలోగల గొట్టబద్ర ,గుమ్మలక్ష్మీపురం ,రామన్ గూడ తరలించీ రూ.22 నుంచి 25మద్య అమ్ముతూ సొమ్ము చేసుకుంటు న్నారు.తాము చేసే వ్యాపారం ద్వారా వచ్చిన లాభాల్లో తలాపాపం తిలా పిడికెడు అన్నట్లుగా పోలిసు ,రెవెన్యు బహిరంగంగా చెప్పుకోవటం కోసమెరుపు. కురుపాం మండలంలోని 23పంచాయితీలలో సుమారు 19పంచాయితీల పిడిఎస్ బియ్యంకొనుగోలు వీరేచేయ టం...కొందరు వ్యాపారులు రేషన్ కార్డులను కుదువపెట్టుకుని వారి అవసరాలకు డబ్బులు ఇచ్చీ ఏళ్ళుతరబడి రేషన్ వ్యాపారులు లాగేస్తున్నారు. గతంలో ఒకటి రెండుసార్లు రెవెన్యు 6ఎకేసులు నమోదు చేసినప్పిటికీ ఎలాంటి కట్టడి పడలేదు.ప్రస్తుతం సివిల్ సప్లయ్ అదికారులు, పర్యవేక్షణ అదికారులు మామూళ్ళమత్తులో మునిగి నిబంధనలు గాలికి వదిలేశాయని పలు గిరిజన సంఘాలమండి పడుతున్నాయి.

రీ సైక్లింగ్ తో దగాపోతున్న గిరిజనం

పండుగలు, శుభకార్యాలకు వచ్చిన అతిదులకు నాణ్యమైన ఆహారం వండి వడ్డించాలనే ఆశపడే అమాయక గిరిజనుల్ని ఆశరాగా చేసుకునీ రేషన్ బియ్యం గింజల్ని అరగదీసి రబ్బరు ఫాలీష్ చేసి పెద్ద కంపెనీ మిల్లు గోనెసంచులతో మాయం చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు.ఫంక్షన్ లకు అయితే ఒకేసారి వండి వెంటనే ఖాళీ చేయటం జరుగుతుంది కనుక గందికలో పట్టించుకోకుండ ముందే డబ్బులు ,చెల్లింపు చేసేవారు కొందరైతే అరువు కనుక ఇచ్చిందే బ్రహ్మ పదార్థంఅన్నట్లుగా సాగిస్తున్నారు.ప్రభుత్వయంత్రంగం పటిష్టమైన చర్యలు చేపట్టకుంటే పేదోడి నోటి కూడు లాగేసుకోవడం ఆగదని పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీలపై ఎస్మా రద్దు చేయాలి

ఐసిడిఎస్ అధికారులు ప్రభుత్వం అంగన్వాడీలను భయపెట్టడం మానుకోవాలి

రౌండ్ టేబుల్‌లో అఖిలపక్షాలు, ప్రజా సంఘాల డిమాండ్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: అంగన్ వాడిలను చర్చిలకు పిలిచి మంచి వాతావరణంలో చర్చలు జరిగేటట్లు సమస్య పరిష్కారం అయ్యేటట్లు రాష్ట్ర ప్రభుత్వం చూడాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రసందర్భంగా తీర్మానాలు రౌండ్ టేబుల్ సమావేశం అంగీకరించింది. ప్రధానంగాఅంగన్వాడి సమస్య పరిష్కారం చేయకపోతే సంక్రాంతి తర్వాత రాష్ట్ర బందును జయప్రదం చేయాలని,అంగన్వాడీలకు ఇచ్చినటువంటి ఎస్మా షొకజ్ నోటీస్లు యస్మాను వెనక్కి తీసుకోవాలని. రెండు తీర్మానాలు ఆమోదించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వరకు సభ్యులు ఇందిర, సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మథరావు. అంగన్వాడి నాయకులు జి జ్యోతి. గౌరీ మణి. రైతు కూలి సంఘం నాయకులు శ్రీను నాయుడు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ బి నరసింగరావు. సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎం భాషా. గిరిజనసంక్షేమ సంఘం నాయకులు రంజిత్ కుమార్. ప్రగతి సార్ మహిళా సంఘం నాయకులు పి రమణి. మానవ హక్కుల సంఘం నాయకులు వి దాలినాయుడు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సమాచారం ఏఐవైఎఫ్ గోపి నాయుడు రైతు సంఘం నాయకులు బి దాసు. గిరిజన సంఘం నాయకులు రామస్వామి. ఐద్వాజిల్లా కార్యదర్శి ఆర్ శ్రీదేవి. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు పాల్గొన్నారు.

అంటిపేట, లచ్చయ్యపేట గిడ్డంగులను జేసీ పరిశీలన

విశాలాంధ్ర -సీతానగరం: మండలంలోని రామవరంలో రేషన్ పంపిణీతో పాటు అంటిపేట, లచ్చయ్యపేటలో గిడ్డంగులను జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు గురువారం పరిశీలించారు. అక్కడ రేషన్ సరుకులు పంపిణీ గూర్చి, లెవీ సేకరణ గూర్చి ఆరాతీశారు. ఆయనతో పాటు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవుళ్ళ నాయక్,తహాశీల్దార్ ఎన్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటిలోనే తాగునీరు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: పార్వతీ పురం మండలంలో గల సంగంవలస గ్రామంలో ఈదుస్థితి. గ్రామ ప్రజలు త్రాగే కొళాయి నీరు దగ్గరే మురుగునీరు. మరెందుకు మలేరియా టైఫాయిడ్ ఇంకెన్నో సమస్యలు రావని గ్రామ ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు త్రాగునీరు ఉన్న కొళాయి పైపు దగ్గరే ఇలా మురుగునీరు ఉండడం. కాలువ పూడికలు తీయకపోవడం వల్లేనని కుళాయి లైన్ దగ్గర ఇలా మురుగునీరు ఉండడం వల్ల త్రాగే నీరులో మురుగు నీరు కలిసే అవకాశం ఉందని ఇలాంటి నీరు నిలిచిపోయే గుంటల వల్ల దోమలు చేరే కారణంగా వీధిలో ఉన్న ప్రజలకు ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయని ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు

సామాజిక న్యాయానికి ప్రతీక బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనం

విశాలాంధ్ర-విజయనగరం: ఈనెల 19వ విజయవాడలో సీఎం జగన్మోహన్ రెడ్డి చేతుల రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ జరగనుందని జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. జెడ్పి సమావేశమందిరంలో గురువారం సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి భారీగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లేందుకు సన్నాహాలు చేపడుతున్నామని తెలిపారు. గత పాలకులు సామాజిక న్యాయం కోసం అనేకసార్లు ప్రస్తావించినప్పటికీ దాన్ని క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లి అమలుచేసిన ఘనత సీఎం జగన్ కు మాత్రమే దక్కిందన్నారు. బొబ్బిలి లో బుధవారం జరిగిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రా కదలిరా కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైందన్నారు. ఎన్నికల సమయం దగ్గరైన ప్రతిసారి తెలుగుదేశం నాయకులు ఎన్టీఆర్ని ఆయన భావజాలాన్ని పాటిస్తామని ప్రకటిసస్తారనీ, ఎన్నికల అవ్వంగానే ఆయన ఆశయాలను పక్కకు నెట్టేస్తారని అన్నారు. చంద్రబాబు నాయుడు, విజయనగరం జిల్లా తెలుగుదేశం నాయకత్వం తమ హయాంలో జిల్లాకు ఏం న్యాయం చేశారో చెప్పాలన్నారు. అనేకసార్లు భోగాపురం విమానాశ్రయం గురించి మాట్లాడుతున్న వారు..వారి హయాంలో పనులు ఎందుకు మొదలు పెట్టలేకపోయారని ప్రశ్నించారు. కేవలం ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకే భోగాపురం విమానాశ్రయ, గిరిజన విద్యాలయం, మెడికల్స్ కళాశాల వంటి కార్యక్రమాలకు జీవోల పేరిట అట్టహాసం చేశారని తెలిపారు. 2024 ఎన్నికలలో జగన్ సునామీలో ఫ్యాన్ ప్రభంజనం సృష్టించబోతుందని అన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో మళ్లీ అన్ని స్థానాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం శాసనసభ్యులు అలజంగి జోగారావు , రాజాం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ డాక్టర్ తలే రాజేష్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జోనల్ ఎస్సీ సెల్ ఇంచార్జ్ కంబాల సందీప్, జిల్లా ఎస్సీ విభాగ అధ్యక్షుడు జైహింద్ కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల అమలులో ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలి

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాల అమలులో ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23 నుండి 31వ తేదీ వరకు వైఎస్సార్ ఆసరా పథకం, ఫిబ్రవరి నెల 5 నుండి 14వ తేదీ వరకు వైఎస్సార్ చేయూత పథకం క్రింద ఆర్ధిక సహాయం అందించనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాల పకడ్బందీ అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ ఆదేశాల అమలుపై డి.ఆర్.డి.ఏ-వైయస్సార్ క్రాంతి పథకం మండల శాఖాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో గురువారం మధ్యాహ్నం ఎస్.కోట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ ఈనెల 23 నుండి 31వ తేదీ వరకు మహిళా స్వయం సహాయక పొదుపు సంఘాలకు వై.ఎస్.ఆర్ ఆసరా పథకం క్రింద 4వ విడత ఆర్థిక సహాయం, ఫిబ్రవరి నెల 5 నుండి 14వ తేదీ వరకు వై.ఎస్.ఆర్. చేయూత పథకం క్రింద 45-60 సంవత్సరముల మధ్య వయస్సు గల మహిళలకు వరుసగా 4వ సంవత్సరం ఆర్థిక సహాయం అందించనున్న నేపథ్యంలో కార్యక్రమాలకు లబ్దిదారులు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొనేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 8 రోజులకు ఒక షెడ్యూల్ తయారు చేసుకోవాలని, అలాగే ఈ కార్యక్రమములు ప్రీ లాంచ్, లాంచ్ డే, పోస్ట్ లాంచ్ మూడు దశల్లో జరుగుతాయని తెలిపారు. ఈమేరకు క్షేత్రస్థాయిలో షెడ్యూలుపై లబ్దిదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, ఈ కార్యక్రమాలు జరిగేటపుడు ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం ఉండేలా జాగ్రత్త వహిస్తూ, కార్యక్రమ నిర్వహణ పెద్దఎత్తున చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్మోహన రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం, ప్రజలకు ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తూ విశ్వసనీయతకు మారు పేరుగా నిలబడిందని చెప్పడానికి ఈ కార్యక్రమాల అమలు ఒక నిదర్శనమని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎం.పి.పి నండి సోమేశ్వరరావు, జెడ్పీటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎం.పి.పి ఇందుకూరి సుధారాజు, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి, మండలంలోని ఇతర సర్పంచులు సూర్యనారాయణ, యాళ్ళ రమణ, ఎం.పి.టి.సిలు పదాల ధర్మారావు, బోదల దేముడు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ బషీర్, వార్డు మెంబర్లు సూరిబాబు, గణేష్, మాజీ సర్పంచులు బుజ్జి, పోతయ్య, రామకృష్ణ, కె.వెంకటరావు, మాజీ ఎం.పి.టి.సి బోజంకి గోవింద, నాయకులు మోపాడ శ్రీను, వాకాడ రమణ, సుంకరి బుల్లి, సతీష్, గంగరాజు, కిట్టు, ఎమ్పీడిఓ శేషుబాబు, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ ఆదియ్య, ఏ.పి.ఎమ్ సురేష్ కుమార్, పలువురు సి.సిలు, వి.ఓ.ఏలు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని అంగనవాడీలు నిరసన

విశాలాంధ్ర-గజపతినగరం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు గజపతినగరం జాతీయ రహదారి ప్రక్కన మోకాళ్లపై కూర్చొని గురువారం నిరసన తెలిపారు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వి లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు మరల ప్రభుత్వం చర్యలు చేపట్టి జీతం సమస్యపై సానుకూలమైన వైఖరి తీసుకొని మా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి లక్ష్మి ప్రాజెక్ట్ అధ్యక్షులు సుభాషిని జ్యోతి సెక్టార్ లీడర్లు రమణమ్మ రాములమ్మ సన్యాసమ్మ వాణి సుజాత జ్యోతి పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షునిగా సుంకరి గణేష్

విశాలాంధ్ర-జామి: కాంగ్రెస్ పార్టీ అనుభదం సంస్థ అయిన నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌యూఐ) జిల్లా అధ్యక్షునిగా మండలంలోని భీమసింగి గ్రామానికి చెందిన విద్యార్థి నాయకుడు సుంకరి గణేష్ నియమితులయ్యారు. ఈమేరకు విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్ చేతుల మీదుగా నియామక పత్రంను గణేష్‌కు అందజేసారు. విద్యార్థి నాయకునిగా, యువజన నాయకుడుగా గణేష్ అనేక ప్రముఖ యూనియన్‌లలో పనిచేసి కీలకమైన నేతగా పేరు పొందాడు. విద్యార్థి, యువజన విభాగాలలో అనేక సమస్యలపై పోరాటం చేసిన చరిత్ర గణేష్‌కు ఉంది. ఆయన సేవలను గుర్తించిన ఎన్ఎస్‌యూఐ తమ విభాగానికి జిల్లా అధ్యక్షునిగా నియమించింది. ఈసందర్భంగా గణేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. జిల్లాలో ఎన్ఎస్‌యూఐని మరింత బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనకు ఈపదవిని ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షుడు నాగుయాదవ్‌కు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ప్రారంభం



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలోని ఒకటో డివిజన్ సాకేటి వీధిలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. ఈరోజు సాకేటి వీధి చేరుకున్న ఆయనకు స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. 14 లక్షల రూపాయలతో నిర్మించిన సామాజిక భవనం స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ప్రారంభోత్సవం అనంతరం మీడియాతో వైసిపి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, జోనల్ ఇన్చార్జి మచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సామాజిక న్యాయాన్ని చేపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాలలో అభ్యున్నతి వైపు తీసుకువెళుతున్నారని అన్నారు. ఆయన స్ఫూర్తితో నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. దీని వలన నగరం అన్ని ప్రాంతాలలో అభివృద్ధి దిశగా పయనిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, కోఆప్షన్ సభ్యురాలు ముద్దాడ రమణి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

మిల్లర్లతో బ్యాంకు గ్యారంటీ చేయిస్తాం

జిల్లా వ్యవసాయ అధికారి రామారావు

విశాలాంధ్ర-వేపాడ: వేపాడ మండల రైతుల ధాన్యం కొనుగోలు కోసం కేటాయించిన మూడు మిల్లులకు బ్యాంకు గ్యారంటీ చేయిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి వి టి రామారావు అన్నారు. మండలంలోని వావిలపాడు, పీకే ఆర్ పురం గ్రామాలతోపాటు రామస్వామి పేట లోని మిల్లును కూడా ఆయన గురువారం సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మిల్లర్లతో మాట్లాడి వెంటనే బ్యాంకు గ్యారంటీ చేయించుకోవాలని ఆదేశించారు. మిల్లర్ల ఆరోపణ మేరకు ధాన్యం ముక్కలు అవుతుందో లేదోనని పరిశీలించారు. ఈ ధాన్యం ముక్కలవడం లేదని గుర్తించారు. వేపాడ మండల రైతుల కోసం కేటాయించిన రామస్వామి పేట, సోంపురం, పిల్ల అగ్రహారం మిల్లుల యజమానులు వెంటనే బ్యాంకు గ్యారంటీలు చేసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు దూర ప్రాంతాల్లో గల మెరకముడీదాం, గరివిడి, చీపురుపల్లి, తెర్లాం, గంట్యాడ, బొబ్బిలి, నెల్లిమర్లలో గల మిల్లులకు తాము ధాన్యం పంపించలేమన్నారు.వేపాడ మండల లక్ష్యం మేరకు 14 వేల ఎనిమిది వందల అరవై ఐదు టన్నులు కొనుగోలు చేయవలసి ఉండగా ఇప్పటివరకు 4000 టన్నులు మాత్రమే కొనుగోలు చేయడం జరిగిందన్నారు. మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామన్నారు.ఈ పరిశీలనలో ఆయన వెంట కొత్తవలస ఏ డి ఏ ఎల్. విజయ, ఏఓ. సి.బి.యస్వంతరావు, తహసిల్దార్ ప్రసన్న కుమార్, సి ఎస్ డి టి ఇందిరా, పిఏసిఎస్ సీఈఓ పిల్ల అప్పారావు, లక్ష్మీ నాయుడు, రైతు భరోసా కేంద్రాల వి ఏ లు, ఏ ఈ ఓ లు నాయకులు పాల్గొన్నారు.

ఈఓపిఆర్డీ జిల్లా అధ్యక్షుడిగా రమేష్

విశాలాంధ్ర-కురుపాం: పార్వతీపురం మన్యం జిల్లా ఈఓపిఆర్డీల జిల్లా అధ్యక్షుడుగా కురుపాం ఈఓపిఆర్డీ జి.రమేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గురువారం నిర్వహించిన ఎన్నికల్లో పార్వతీపురం మన్యం జిల్లా ఈఓపిఆర్డీ కార్యవర్గం. అధ్యక్షులు గా. జి.రమేష్ బాబు, కురుపాం జనరల్ సెక్రెటరీ గా సత్యం, సీతంపేట, ట్రెజరర్ గా రాధాకృష్ణ, కొమరాడ.ఎన్నుకున్నారు .నూతన కార్య వర్గంనకు అందరూ శుభాకాంక్షలు తెలిపారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ చేసిన చిరువ్యాపారి

విశాలాంధ్ర-జామి: చాలామంది వద్ద ధనం అధికంగా ఉంటుంది. కానీ ధానం చేసే గుణం మాత్రం కొందరికే ఉంటుంది. తనకున్న వ్యాపారంలో వచ్చిన ఆదాయంలో కొంత పేదలకు ఏదో రూపంలో పంచాలనే గొప్ప మనుసు చాలా అరుదుగా ఉంటుంది. కానీ మండల కేంద్రమైన జామిలోని ఓచిరువ్యాపారికి మాత్రం ఈమంచి మనస్సు ఉందని నిరూపించు కుంటున్నాడు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన జామిలోని బస్టాండ్‌లో తీగల సతీష్ అనే చిరువ్యాపారి సెల్‌ఫాయింట్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. అయితే తనకు వచ్చిన లాభాల్లోని కొంత నగదును పేదలకు ఏదో ఒకరూపంలో పంపిణీ చేయడం అలువాటు చేసుకున్నాడు. అందుకు ఆయన భార్య గృహలక్ష్మి సహకరించడంతో తనదాతృత్వాన్ని కొనసాగించాడు. ఈసంక్రాంతి సమయంలో యాచకులకు చలికి ఉపయోగపడే దుప్పట్లును పంపిణీ చేయాలని ఆదంపతులు నిర్ణయించుకుని, తమ దుఖాణం వద్దకు వచ్చిన యాచకులకు నగదు బదులుగా రగ్గులను పంపిణీ చేసారు. సతీష్ తనకుమార్తెలు భార్గవి, శ్రీజ్ఞానేశ్వరి చేతుల మీదుగా దానం చేసి తన పిల్లలకు దానంలోని గొప్పతనాన్ని అలవాటు చేస్తున్నారు. సతీష్ తాను చేస్తున్న సేవా కార్యక్రమాన్ని ఎవరికి చెప్పుకోవడం ఇష్టఉండదు. కానీ గురువారం ఈవిషయం విశాలాంధ్ర కంటపడి వెలుగులోకి వచ్చింది.

అరిగిపాలెంలో సర్వే రాళ్లు ఏర్పాటు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని అరిగిపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో గల అరిగిపాలెం, సింగరాయి, జగ్గయ్యపేట తదితర గ్రామాలలో రీ సర్వే పూర్తిచేసిన సర్వే,రెవెన్యూ అధికారులు సర్వే రాళ్ల ఏర్పాటులో తల మునకలై ఉన్నారు. ఈ మూడు గ్రామాల పరిధిలో గల సుమారు 497ఎకరాలలో సర్వే పూర్తి చేసిన సర్వే అధికారులు రాళ్ల వేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.గురువారం చేపట్టే ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ ప్రసన్నకుమార్,మండల సర్వేయర్ అప్పలనాయుడు,రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ అర్జున్,వీఆర్వో సత్యవతి, సచివాలయ సర్వేయర్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.ఎ) నూతన సంవత్సర క్యాలెండర్లను ఎస్.కోట బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఐ.ఎల్.ఎ ఉత్తరాంధ్ర కన్వీనర్ ఎం.అప్పారావు ఆధ్వర్యంలో స్థానిక న్యాయవాదులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర కన్వీనర్ అప్పారావు మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొనే సమస్యలపై పోరాటాలు చేసేందుకు ఐ.ఎల్.ఎ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి డబ్ల్యు.ఎస్.శర్మ, సీనియర్ న్యాయవాదులు బి.త్రిమూర్తులు, టీవీఆర్ మూర్తి, బి.రామకృష్ణ, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, బోని శేఖర్ బాబు, సీహెచ్ఆర్ఏ నాయుడు, బొబ్బిలి రామకృష్ణ, బొడ్డు వెంకటరావు పాల్గొన్నారు.

గాన కవికోకిల శ్రీదేవి టీచర్ కు ఏలూరులో ఘన సన్మానం

- సన్మానించిన రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్పర్సన్

- సహచర టీచర్లు అభినందనలు



విశాలాంధ్ర-వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం ఏలూరులో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని బానాది గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్ గా పని చేస్తున్న గాన కవికోకిల శ్రీదేవిని ఘనంగా సన్మానించారు. అక్కడ నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో జరిగిన కవి సమ్మేళనంలో ఆమెను ప్రభుత్వ పరంగా ఆహ్వానించగా ఆ వేదికపై ఆమె సంక్రాంతి ,సాంప్రదాయాలు అనే అంశాలపై చెప్పిన కవిత అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. శ్రీదేవి టీచర్ ప్రతిభా పాటవాలను గుర్తించిన రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఇప్పటికీ అనేక పర్యాయాలు అనేక చోట్ల ఆమె ప్రదర్శించిన ప్రతిభా పాటవాలను గుర్తించిన ఆయా సాంస్కృతిక సంస్థలు ఘన సన్మానాలు చేయగా తాజాగా ప్రభుత్వం ఆహ్వానించి సన్మాన సత్కారాలు చేయటం పట్ల బానాది గ్రామస్తులతో పాటు తోటి ఉపాధ్యాయులు కూడా ఆమెకు అభినందనలు తెలియజేశారు.

తలపై కుర్చీలు పెట్టుకుని అంగన్వాడీలు నిరసన

విశాలాంధ్ర-శృంగవరపుకోట: తలపై కుర్చీలు పెట్టుకుని అంగన్వాడీలు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన శిబిరంలో గురువారం నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ప్రభుత్వానికి చట్టప్రకారం సమ్మె నోటీసు ఇచ్చి శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న కార్మికులపై ప్రభుత్వం ఎస్మా ఉపయోగించడం ఎంతవరకు సబాబు అని ప్రశ్నించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి తమ రాజకీయ ప్రయోజనం కోసం ప్రతిపక్షంగా ఉన్నప్పుడు అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనపు వేతనాలు ఇస్తానని హామీ ఇచ్చారని, ప్రస్తుతం తెలంగాణలో 13600 జీతం ఇస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణలో మినీ వర్కర్లను మేయిన్ వర్కర్లుగా మార్చి మీనీ వర్కర్లకు మెయిన్ వర్కర్లకు ఇస్తున్న వేతనాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజే అంగన్వాడీల కోరిన కోర్కెను నెరవేర్చుతు వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను కనీసం నెరవేర్చకుండా మిన్నకుందని దుయ్య బట్టారు. కావాలనే తమ మంత్రులు, ఎమ్మెల్యేలతో అంగన్వాడీల పట్ల అసభ్యకరమైన పదజాలాలు మాట్లాడిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అంగన్వాడీల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ సంఘ అంగన్వాడి ప్రాజెక్టు లీడర్ డి.శ్యామల, డి జయలక్ష్మి, జి క్రాంతి, ఏఐటీయూసీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అనుబంధ సంఘ ప్రాజెక్టు లీడర్ వి మాణిక్యం, డి సుశీల, వి దుర్గాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లెంపలేసుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు



విశాలాంధ్ర-సీతానగరం: అంగన్వాడీలు తమసమస్యలు పరిష్కారం చేయాలని గత 31 రోజులుగా అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది సమ్మె చేస్తున్నారు. వేతన పెంపుదల, గ్రాట్యూటీని అమలు చేసి సమస్యను పరిష్కారం చేయాలని, అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలన్నారు.వినూత్నంగా ఈరోజు లెంపలేసుకుని నిరసన తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది కోర్కెలు తీర్చాలని వారంతా నినాదాలుచేస్తూ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు గవర వెంకటరమణ, అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకులు గంట జ్యోతి, వెన్నెల రామలక్ష్మి,మండల నాయకులు మడక సత్యవతి, పి.యశోద వంగపండులక్ష్మి, కె.శైలజ మరిశర్ల సునీత, పి సత్యవతి, రెడ్డి రామలక్ష్మి, ఎం సునీత,పుణ్యవతి తదితర అంగన్వాడీ కార్యకర్తలు ,సహాయకులు పాల్గొన్నారు.

శ్రీ కామాక్షి అమ్మవారి కేలండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయ నగరం టౌన్: బొండాడ వీధిలో 135 సంవత్సరాలుగా వేంచేసియున్న శ్రీ మహాగణపతి కామాక్షి సమేత ఏకాంబ రేశ్వర స్వామి వారి దేవాలయం వద్ద నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు అప్పలబత్తుల సోమరాజు గారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ శశిభూషణరావు, నాగమల్లి శ్రీనివాసరావు, మందరపు వరహాచారి,పల్లంటి నాగబాబు, రామాయణం నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీలు



విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా విద్యార్థి, విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు గురువారం నిర్వహించడం అయింది. ఈ పోటీలు గెలుపొందిన వారికి అతిథిగా వచ్చిన రిటైర్డ్ ఎంఈఓ సత్యన్నారాయణ చేతులమీదగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు అని స్థానిక గ్రంథాలయ అధికారి సి.హెచ్. కృష్ణమూర్తి తెలిపారు.

క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ

సొంత మొత్తంతో 25మందికి అందజేత

విశాలాంధ్ర - మెరకముడిదాం: మెరకముడిదాం మండలం బైరీపురం గ్రామానికి చెందిన 25 మంది క్రీడాకారులకు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మండల అగ్రికల్చర్ అడ్వాయిజర్ కమిటీ చైర్మన్ పప్పల కృష్ణమూర్తి గురువారం తన మొత్తం టీ షర్టులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడలుకు తర్ఫీదు పొందిన క్రీడాకారులును ప్రోత్సాహయించుట కోసం పంపిణీ చేయటం జరిగిందన్నారు. క్రీడాకారులు కోసం భవిష్యత్ లో మరిన్ని కార్యక్రమం లు చేయటం జరుగుతుంది అన్నారు. గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. మండల స్థాయిలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ లక్ష్మి, వై సీపీ నాయకులు గ్రహనేశ్వర్ రావు, కందులు మల్లి పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థుల గృహసందర్శన

విశాలాంధ్ర - తెర్లాం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాడంగి ఉపాధ్యాయు లందరూ జిల్లా విద్యాశా ఖధికారి ఆదేశానుసారం పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా 10 రోజుల సంక్రాతి సెలవుల్లో వివిధ గ్రామాల్లో ఉన్న విద్యార్థుల గృహాలను సందర్శించి విద్యార్థులు సక్రమంగా చదివేటట్లు, వారికున్న డౌట్స్ క్లియర్ చేయటానికి,తల్లిదండ్రులు విద్యార్థుల చదువుపట్ల తగుశ్రద్ధ తీసుకొనేటట్లు సూచనలు చేయటానికి ఉపాధ్యాయులు వివిధ గ్రామాలలో చదువుతున్న విద్యార్థుల గృహాలకు వెళ్ళటం జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యన్నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో గజరాయునివలస, కామన్నవలస గ్రామాలను ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు,ఫిజిక్స్ ఉపాధ్యాయుడు కేతిరెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పార్వతీపురం: జనవిజ్ఞాన వేదిక 2024 సంవత్సర క్యాలెండరును వేదిక నాయకులు డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ ,ఎమ్.రత్నకుమార్, జి.చంద్ర మౌళి, పి.రంజిత్ కుమార్ ,డి.చంద్రమౌళి, గంగాధర రావు, శివకేశవరావులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ మన్యం జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిజన ప్రాంతాల్లో యువతకు ప్రాధమిక స్థాయిలో వైద్య సేవలకు సంబంధించి అవగాహన శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని తెలిపారు. జనవిజ్ఞానవేదిక లక్ష్యాలను వివరించారు.

జిల్లా అభివృద్ధి చంద్రబాబుకు ఏమి తెలుసు?

గజపతినగరం ఎమ్మెల్యే అప్పల నరసయ్య

విశాలాంధ్ర-గజపతినగరం: టిడిపి జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్ర బాబు నాయుడు బుధవారం బొబ్బిలిలో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి ఏమీ జరగలేదని అని అన్నారని గజపతినగరంలో వైయస్సార్ పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం అభివృద్ధి సంక్షేమం గూర్చి మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదని వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వచ్చినప్పటి నుంచి జిల్లాలో అభివృద్ధి జరిగిందని చంద్రబాబు 14 సంవత్సరాలు జిల్లాకు ఏం చేశారో చెప్పాలని అన్నారు జగన్మోహన్ రెడ్డి హయాంలో ఇంజనీరింగ్ కాలేజ్ ఆంధ్ర యూనివర్సిటీ ఎక్స్టెన్షన్ కౌంటర్ కస్తూరిబా మోడల్ స్కూల్ తోటపల్లి కి 90% పనులు రిజర్వాయర్ శంకుస్థాపన ప్రారంభం వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని ప్రతి నియోజకవర్గంలో పీహెచ్సీకి ఇద్దరు డాక్టర్లు పెట్టి ఆరోగ్య సమస్యల గురించి పెట్టారని 1100 కోట్ల రూపాయలను ఇచ్చిందని నియోజకవర్గంలో 750 కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని సామాజిక న్యాయం గూర్చి మాట్లాడే నైతిక హక్కు తెలుగుదేశం పార్టీకి లేదని అన్నారు దమ్ము ధైర్యం ఉంటే జిల్లాలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు జిల్లాలో 9 నియోజకవర్గాల్లో గెలుపు మాదే అని ఇప్పటికైనా కళ్ళు తెరవాలని ప్రజలకు జరిగిన అన్యాయాన్ని చూడాలని ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టడానికి డాక్టర్ కే ఏ నాయుడు 500 ఎకరాలు దోచుకున్నా అనడం అని అది ఆయనకే రిజిస్ట్రేషన్ చేస్తానని అన్నారు టిడిపి జనసేన పొత్తు పెట్టుకున్నాము మేమే గెలుపుని మరో భ్రమలో ఉన్నారన్నారు ఈ సమావేశంలో జడ్పిటిసి గార తౌడు మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు వైసీపీ నాయకులు కరణం ఆదినారాయణ సామంతుల పైడ్రాజు మండల సురేష్ కర్రి రాము నాయుడు కర్రి నానాజీ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

156 మందికి వైద్య పరీక్షలు

ఉచితంగా మందులు పంపిణీ

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రం వేపాడ గ్రామ సచివాలయం వద్ద గురువారం శృంగవరపుకోటకు చెందిన సంజీవని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు వేణు, మధుబాల, డానియల్, చంద్రశేఖర్,బాలాజీ సాయికుమార్ల సారధ్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో కీళ్ళ వైద్యులు వేణు, స్త్రీల వైద్య నిపుణులు (గైనకాలజిస్టు)మధుబాల, జనరల్ వైద్యులు డానియల్, రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా రూ. 20వేల రూపాయల ఖరీదు గల మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వైద్యులు వేణు మాట్లాడుతూ గ్రామంలోని 156మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఈ వైద్య శిబిరంను ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు ప్రారంభించారు. కాగా మండల తహసీల్దార్ ప్రసన్నకుమార్, వల్లంపూడి ఏఎస్ఐ బి.వి రమణ, ఈఓపిఆర్‌డి ఉమా,గ్రామ సర్పంచ్ మెలిపాక అర్జునమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు గాడి గంగతల్లి, మెలిపాక రమణ,పాస్టర్ అబ్రహం, తదితరులు కూడా వైద్యపరీక్షలు నిర్వహించుకున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా సాధారణ కీళ్ల నొప్పులు,జ్వర పీడితులు,షుగర్,బీపీ వంటి దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసినట్లు, తెలిపారు.ఈ కార్యక్రమంలో సంజీవని ఆసుపత్రి ఎం.డి చేతన్,ఏఓ సిబ్బంది తదితరులు పాల్గొని రోగులకు సేవలు అందజేశారు.

సీతం రోసిస్ వర్చువల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం



విశాలాంధ్ర-విజయనగరం టౌన్: గాజులరేగ పరిధిలో వున్న సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజిమెంట్ (సీతం), రోసిస్ వర్చువల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, విశాఖపట్నం మధ్య విద్యార్థులు, అధ్యాపకులలో డ్రోన్ పై నైపుణ్యం అభివృద్ధి కోసం ఎం.ఒ.యు ల మార్పిడి జరిగింది.ఈ ఎం.ఒ.యు ముఖ్య ఉద్దేశం ఐ.సి.డి.టి (ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్) స్థాపించడం,ఆత్మనిర్భర్ భారత్ పునాదిపై ఒక సంస్థాగత డ్రోన్ సంబంధిత ఆచరణాత్మక శిక్షణ నిర్వహించడం కళాశాలలో ఆర్.అండ్.డి సెంటర్ ప్రారంభించడం డిజైన్ బ్యూరోలు, పరిశ్రమ మరియు మార్కెట్‌తో ఏకీకరణ ద్వారా డ్రోన్ సంబంధిత అవకాశాలను అన్వేషించడం.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి మాట్లాడుతూ, ఈ ఎం.ఒ.యు ద్వారా 1,500 మంది విద్యార్థులు మరియు అధ్యాపకులు నైపుణ్యం అభివృద్ధి చెందుతుందని తెలియచేశారు. సత్య గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణరావు సమక్షంలో ఎం.ఒ.యు పై సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సీతం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ టి.డి.వి.ఎ నాయుడు, రోసిస్ వర్చువల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎస్.కె.వెంకట సతీష్ పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక క్యాలెండర్ ఆవిష్కరణ



విశాలాంధ్ర-బెలగాం : జన విజ్ఞాన వేదిక నూతన సంవత్సర క్యాలెండర్ ను వేదిక నాయకులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, ఎం. రత్నకుమార్, జి. చంద్ర మౌళి, పి. రంజిత్ కుమార్, డి. చంద్రమౌళి, గంగాధరరావు, శివకేశవరావులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మన్యం జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిజన ప్రాంతాల్లో యువతకు ప్రాధమిక స్థాయిలో వైద్య సేవలకు సంబంధించి అవగాహన శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని తెలిపారు.

రైతులకు అండగా వుంటాం

జిల్లా డిసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన



విశాలాంధ్ర-విజయనగరం: రైతులు విత్తనం వేసిన దగ్గరనుంచి పంట విక్రయించేవరకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అండగా ఉంటూ పరిపాలన సాగి స్తున్నారని ఉమ్మడి విజయనగరం జిల్లా డి.సీ.ఎం.ఎస్ చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన పేర్కొన్నారు. విజయనగరం డి.సీ.ఎం.ఎస్ కార్యాలయంలో వై.సీ.పీ జోనల్ వింగ్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్ తో కలిసి ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అవనాపు భావన మాట్లాడుతూ డి.సీ.ఎం.ఎస్ ద్వార రైతులకు చేదోడుగా ఉంటూనే బిజినెస్ ఇంప్లిమెంట్ చేస్తూ అత్యదిక టర్నోవర్ సాదిస్తున్నామన్నారు. రైతులు పండించిన ఆర్గానిక్ పంటలకు, మిల్లెట్ ప్రొడక్ట్స్ కు ఇటివల మొబైల్ వ్యాన్ ద్వారా విజయవంతంగా మార్కెటింగ్ కల్పించామని, ఈ కార్యక్రమాన్ని రానున్న రోజుల్లో మరింత విస్తృతం చేస్తామన్నారు. వై.సీ.పీ జోనల్ వింగ్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రెండో సారి జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవడం తధ్యమని అయన ధీమా వ్యక్తం చేసారు.

సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ధ్యేయం: నగర మేయర్ విజయలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ధ్యేయమని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. ఈరోజు కోటి 12 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 31,32, 33,42, 43 డివిజన్లలో 13 అభివృద్ధి పనులకు రహదారులు కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ నగర అభివృద్ధికి అహర్నిశలు ప్రణాళికలు రచించి అమలు చేయడమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పర్యటించిన సందర్భంగా స్థానికులు తెలిపిన సమస్యలను పరిష్కరించే దిశగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. కోటి 12 లక్షల రూపాయలతో ఈరోజు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. నగరంలో ఇప్పటికే తాగునీటి సమస్య లేకుండా రోజు విడిచి రోజు నీటి పంపిణీ జరిగే విధంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు. 31వ డివిజన్ కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు మాట్లాడుతూ తమ డివిజన్లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక చొరవతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం డివిజన్ ప్రజల అదృష్టమని అన్నారు. తాము తెలిపిన వెంటనే ఆ సమస్య పరిష్కారానికి ఆయన ఎంతగానో శ్రద్ధ చూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జ్ కోలగట్ల కృష్ణారావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలోని 35,36, 37 డివిజన్లకు సంబంధించి శ్మశాన వాటిక నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపన చేశారు. ఎంతో ఉపయుక్తమైన స్మశాన వాటిక కు అవసరమైన రహదారి ఇతర సౌకర్యాలను త్వరితగతిన చేపట్టాలని అధికారులకు ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల కార్పొరేటర్లు చందక శ్రీనివాసరావు, కడియాల రామకృష్ణ, బాలి పద్మావతి మీడియాతో మాట్లాడుతూ దహన సంస్కారాలు చేసే సమయంలో స్మశాన వాటికలో అనేక సమస్యలు ఎదుర్కొనే వారన్నారు. ఈ దుస్థితిపై డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి దృష్టికి తెచ్చిన వెంటనే ఆయన స్పందించి స్మశాన వాటిక పునరుద్ధరణకు చర్యలు చేపట్టారన్నారు. స్వర్గధామం లా ఉండేవిధంగా స్మశాన వాటికను తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. అందరి సూచనలు సలహాలతో స్మశాన వాటిక నిర్మాణాన్ని తీర్చిదిద్దుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తాత్రాజు కృష్ణ, మూడు డివిజన్ల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

12న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఫైనల్స్ పోటీలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట డాక్టర్ వరలక్ష్మీ స్కూల్లో ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో ఫైనల్స్ పోటీలు ఈనెల 12 వతేది ఉదయం ప్రారంభమవుతాయని ఎస్.కోట మండల క్రీడా కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. క్రీడా కోఆర్డినేటర్ శ్రీరాములు స్థానిక విలేకరులతో గురువారం మాట్లాడుతూ ఎస్.కోట ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు సెమీఫైనల్స్ కు చేరుకున్నాయని, శుక్రవారం ఉదయం ఈ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. కాగా భావానీనగర్ గ్రామంలో గల డాక్టర్ వరలక్ష్మి స్కూల్లో వాలీబాల్ క్రీడాకారులను వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఏ .భార్గవ్ రామ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల క్రీడా కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గత అర్ధరాత్రి మద్యం అక్రమ విక్రయాలు?

ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డ ఆటో

విశాలాంధ్ర-వంగర: మంగళవారం నాడు అర్ధరాత్రి మండలంలో గల మద్దువలస బ్రాందీ షాపు నుంచి అందులో పనిచేస్తున్న వ్యక్తి అర్ధరాత్రి 250 బ్రాందీ సీసాలను నిబంధనలకు విరుద్ధంగా అధికరేట్లకు విక్రయించినట్లు తెలిసింది.మద్దువలస షాపు నుండి ఈ అక్రమ మద్యం ను గ్రామాలకు తరలించినట్లు తెలిసింది.అర్ధరాత్రి 12 గంటలు సమయంలో ఈ బ్రాందీ షాపు నుంచి ఈ 250 మద్యం సీసాలు ను అక్రమంగా అర్ధరాత్రి విక్రయిస్తుండటాన్ని తెలుసుకొన్న ఎక్సైజ్ అధికారులుమాటువేసి పట్టుకొన్నారు. మద్దువలస గ్రామానికి చెందిన బూరాడ సురేష్ ఆటోతో ఈ మద్యం సీసా లు తరలిస్తుండగా, ఎక్సైజ్ అధికారులు కు పట్టుబడ్డారు.పట్టుబడ్డ బూరాడ సురేష్ ను, ఆటోతో సరుకును ఎక్సయిజ్ అధికారులు స్వాధీనం చేసుకొని,సురేష్ ను కష్టడీలోకి తీసుకొన్న ట్లు సమాచారం.అయితే అక్రమంగా అర్ధరాత్రి ఈ మద్యమ సీసాలను విక్రయించిన వ్యక్తి పేరును గోప్యంగా ఉంచుతున్నట్లు సంభందిత అధికారుల వ్యవహరిస్తున్న తీరు తెన్నులు పై అనుమానాలు వ్యక్తం కాక తప్పటం లేదు. మద్దువలస బ్రాందీ షాపు నుంచి మద్యం సీసాలను అధికరెట్లు కు విక్రయిస్తూ సంక్రాంతి పండగ సందర్భంగా అనేక గ్రామాలకు తరలిస్తున్నట్లు తెలిసింది.గత కొన్ని రోజులుగా ఈ విధంగా అక్రమ వ్యాపారం చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు కానీ,ఎవ్వరూ పట్టించుకొకపోవటంతో వారి ఇష్టా సారంగా నిబంధనలను తుంగలోకి తొక్కి అందులో పనిచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ అక్రమ మద్యం బాటిళ్ల అమ్మకాలు,తదితరవాటిపై రాజాం ఎక్సైజ్సంప్రదించగా తరువాను చెబుతాను,అంటూ సమాచారాన్ని ఇవ్వకుండాదాట వేస్తున్నారు. సీఐ ను ప్రశ్నించగా అక్రమ మద్యం ముద్దాయిలను అరెస్ట్ చేసి,స్టేషన్ బెయిల్ గురువారం నాడు ఇచ్చినట్లు సీ ఐ శ్రీధర్ చెప్పారు. డిపోరమేష్ రమేష్ ను సంప్రదించగా తాను సెలవులో ఉన్నట్లు తెలియ జేస్తూ,విధుల్లో కి వచ్చిన వెంటనే ఈ అక్రమ మద్యం తరలింపు బాధ్యులను తొలగించ నున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా కార్యక్రమాలు



విశాలాంధ్ర-సీతానగరం: మండల స్థాయిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలు మండలంలోని జోగమ్మపేటలోనిబిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల మైదానంలో, సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో, మండల విద్యాశాఖాధికారి మైదానంలో జరుగుతున్నాయి.ఆడుదాం ఆంధ్రాలో క్రీడలు క్రికెట్, వాలీబాల్ , బ్యాడ్ మింటన్, ఖో ఖో, కబడ్డీ ఆటలు ఆడటం జరుగుతుందని ఎంపిడిఓప్రసాద్ చెప్పారు. 21గ్రామ సచివాలయంలలో గల క్రీడాకారులకు టీ షర్టులు, టోపీలు అందజేయగా వాటిని ధరించి క్రీడల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. అందజేసినట్లు ఎంపిడిఓ ప్రసాద్ చెప్పారు. మండల స్థాయిలో జరుగుతున్న క్రీడలలో ఎంపిపి ప్రతినిది బలగ శ్రీరాములు, జెడ్పీటీసీ బాబ్జి, మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, ఎంపిడిఓ ప్రసాద్, తహశీల్దార్ ఎన్వీరమణ, ఎస్ఐ ఎం.రాజేష్, ఈఓపిఆర్డీ కుమార్ వర్మ, ఎంఈఓలు సూరిదేముడు, వెంకటరమణ, సెక్రటరీలు,సచివాలయం సిబ్బంది,వ్యాయామ ఉపాధ్యాయులు,వివిద సచివాలయంల సిబ్బంది, సెక్రటరీలు, వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో 'రా-కదలిరా' బహిరంగ సభ ఘన విజయం

నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర-శృంగవరపుకోట : బొబ్బిలిలో "రా-కదలిరా" బహిరంగ సభ ఘన విజయం సాధించిందని టీడీపీ ఎస్.కోట నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శృంగవరపుకోట మండల కేంద్రంలోని అన్న క్యాంటీన్ వద్ద టీడీపీ నాయకులు గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీ ప్రజలకు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను, దౌర్జన్యాలను, అక్రమాలను ఎతి చూపేందుకు చంద్రబాబునాయుడు 'రా కదలిరా' కార్యక్రమాన్ని ప్రారంభించారని, దానిలో భాగంగా 10వ తేదీన బొబ్బిలిలో నిర్వహించిన 'రా కదిలి రా' బహిరంగ సభకు వేలాదిగా ప్రజలు పాల్గొని తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలిపారని, సభలకు వచ్చే జనాన్ని చూసి తాడేపల్లి పిల్లిలో వణుకుడు మొదలైందని, రాబోయేది తెలుగుదేశం-జనసేన ప్రభుత్వమేనని, అలాగే జిల్లాలో అన్ని సీట్లు గెలవబోతున్నామని స్పష్టం చేశారు. మన భూమి పాస్ బుక్ మీద జగన్ బొమ్మ ఎందుకని ? మన భూముల రికార్డులను తారుమారు చేసి, వాటిని అమ్ము కునేందుకు వైకాపా ప్రభుత్వం కుట్ర చేస్తుందని, భూహక్కు చట్టం అమలైతే అనేక ఇబ్బందులు వస్తాయని, వాటిని కూడా ఈ అవినీతి ముఖ్యమంత్రి తాకట్టు పెట్టి రుణాలు తెస్తాడని తెలిపారు. ఐదేళ్ల పాలనలో యువత నిరుద్యోగులుగా మారారని, రాష్ట్రానికి పరిశ్రమలు ఒక్కటి కూడా రాకపోగా, ముందుగా ఉన్న పరిశ్రమలు ఒక్కొక్కటిగా వైసీపీ నాయకుల అవినీతికి తరలి పోయాయని తెలిపారు. ప్రతి ఏటా జనవరిలో క్యాలెండర్ , మెగా డీఎస్సీ అని అన్నారని ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని, మన పిల్లలు రోడ్లమీద ధర్నా చేసే పరిస్థితి వచ్చిందని, ఈ ప్రభుత్వ వేధింపులతో అనేక కంపెనీలు రాష్ట్రం నుంచి తరలిపోయాయని విమర్శించారు. యువత కోసం పరిశ్రమలు తీసుకువచ్చి, ఉద్యోగాలు ఇచ్చే భాధ్యత తెలుగుదేశం పార్టీ తీసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే లలితకుమారి వివరించారు. ఈ కార్యక్రమంలో శృంగవరపుకోట మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, జడ్పీటీసీ అభ్యర్థి భీశెట్టి అరుణ, బోనంగి జ్యోతి, ఎస్.కోట పట్టణ పార్టీ అధ్యక్షులు కోనేదం మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వాకాడ బాలు, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్, యువత పెదగాడ రాజు, యూనిట్ ఇంఛార్జ్ కునిరెడ్డి శ్రీరామూర్తి, బూత్ కన్వీనర్లు రవీంద్ర,అయ్యప్ప శేఖర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు తక్షణం పరిష్కరించాలి

విశాలాంధ్ర-బెలగాం: అంగన్వాడీలపై ఎస్మాను రద్దు చేయాలని, సమస్యను పరిష్కారం చేయాలని, జీతం పెంచాలని, ఐసిడిఎస్ అధికారులు ప్రభుత్వం అంగన్వాడీలను భయపెట్టడం మానుకోవాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక ఎన్జీఓ హోంలో గురువారం సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ అధ్యక్షతన అఖిలపక్ష పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చాలా మొండిగా దుర్మార్గంగా వ్యవహరిస్తుందని సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకుండా జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయకుండా హామీని అమలు చేయమని అడిగినందుకు అంగన్వాడీలను భయభ్రాంతులకు గురి చేయడం, 27 రోజుల తర్వాత అంగన్వాడీలు అత్యవసర సేవలు విభాగంలోకి వస్తారని చెప్పి ఎస్మా జీవో నెం: రెండు తీసుకొచ్చి నోటీసులు ఇచ్చి పచ్చి దుర్మార్గంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. అంగన్వాడి సేవలు అత్యవసర విభాగాల క్రిందకు రావని పాలు, ట్రాన్స్ పోర్ట్, విద్యుత్, వైద్యం లాంటివి అత్యవసర సేవా విభాగంలోకి వస్తాయని ఆ మాత్రం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియకపోవడం చాలా దారుణమని కేంద్ర బిజెపి అనుసరిస్తున్న ఫాశిస్టు విధానాలనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందని ఈ విధమైన చర్యల వలన రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించవలసి వస్తుందని, ఇప్పటికైనా సమగ్ర శిక్షా అభియాన్, మున్సిపల్ కార్మికుల సమస్యలు చర్చల ద్వారా పరిష్కారం చేసినట్లు అంగన్వాడిలను చర్చలకు పిలిచి మంచి వాతావరణంలో చర్చలు జరిగేటట్లు సమస్య పరిష్కారం అయ్యేటట్లు రాష్ట్ర ప్రభుత్వం చూడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రెండు తీర్మానాలు రౌండ్ టేబుల్ సమావేశం అంగీకరించింది. అంగన్వాడీల సమస్య పరిష్కారం చేయకపోతే సంక్రాంతి తర్వాత రాష్ట్ర బంద్ ను జయప్రదం చేయాలని, అంగన్వాడీలకు ఇచ్చినటువంటి ఎస్మా షోకాజ్ నోటీసులను, ఎస్మాను వెనక్కి తీసుకోవాలనే తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఇందిరా, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, అంగన్వాడి నాయకులు జి. జ్యోతి, గౌరీ మణి, రైతు కూలి సంఘం నాయకులు శ్రీనునాయుడు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు బి. నరసింగరావు, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎం. భాషా, గిరిజనసంక్షేమ సంఘం నాయకులు పి. రంజిత్ కుమార్. ప్రగతి మహిళా సంఘం నాయకులు పి. రమణి, మానవ హక్కుల సంఘం నాయకులు వి. దాలినాయుడు, ఎఐవైఎఫ్ నాయకులు కూరంగి గోపినాయుడు, రైతు సంఘం నాయకులు బంటు దాసు, గిరిజన సంఘం నాయకులు కె. రామస్వామి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీదేవి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ గురువారం ప్రారంభించారు. ఎస్.కోటలోని ఆకుల డిపో వద్ద గల మైదానంలో ఈ పోటీలు ప్రారంభించిన అనంతరం క్రిష్ణ మాట్లాడుతూ ఈ నెల 11 నుండి 14 వరకు శృంగవరపుకోట యువతను 8 టీములుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో గెలిచిన మొదటి టీముకు రూ.50 వేలు, రెండవ స్థానంలో నిలిచిన టీముకు రూ.35వేల చొప్పున నగదు బహుమతులు అందచేయుట జరుగుతుందన్నారు. అలాగే బెస్ట్ బాట్స్మెన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గా నిలిచిన క్రీడాకారులకు ప్రైజ్ మనీ ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ఇక క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయని, క్రీడలలో పాల్గొన్న యువతకు ఆరోగ్యం కూడా సిద్ధిస్తుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో రాయవరపు చంద్రశేఖర్ (విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు), రెడ్డి పైడిబాబు (జామి మాజీ మండల పార్టీ అధ్యక్షులు), జుత్తాడ రామసత్యం (మండల పార్టీ సెక్రటరీ), అదారి రమేష్ (మాజీ ఎంపీటీసీ), మాదిబోయిన మంగరాజు (మాజీ వార్డ్ మెంబెర్), యువత పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 21సం.ల కఠిన కారాగారం, రూ.3వేలు జరిమానా

జిల్లా ఎస్పీ ఎం.దీపిక

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా ఎల్.కోట పోలీసు స్టేషనులో 2019 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడైనవేపాడ మండలం రామస్వామిపేట గ్రామానికి చెందిన గుడే కోటేశ్వరరావు (36) (ఆటో డ్రైవరు)కు ప్రత్యేక పోక్సో న్యాయమూర్తి కే. నాగమణి 21 సం.ల కఠిన కారాగార శిక్ష మరియు రూ. 3000/-లు జరిమానా విధిస్తూ జనవరి 11న తీర్పు వెల్లడించినట్లుగా జిల్లా ఎస్పీ ఎం. దీపిక తెలిపారు.వేపాడ మండలం రామస్వామిపేట గ్రామానికి చెందిన నిందితుడు గుడే కోటేశ్వరరావు (36 సం.ఎలు) అనే వ్యక్తి ఒక మైనరు బాలికపై లైంగిక నేరంకు పాల్పడినట్లుగా బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో ఎల్.కోట పోలీసు స్టేషనులో 2019 ఫిబ్రవరి మాసంలో పోక్సో చట్టం ప్రకారం అప్పటి ఎల్.కోట ఎస్ఐ ప్రయోగమూర్తి కేసు నమోదు చేయగా, అప్పటి విజయనగరం సబ్ డివిజన్ డిఎస్పీ డి. సూర్య శ్రావణ్ కుమార్ దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. అనంతరం, విజయనగరం డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పి. వీరాంజనేయ రెడ్డి నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. ఈ కేసును ప్రాధాన్యత కేసుల జాబితాలో చేర్చి, ప్రాసిక్యూషను పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. నిందితుడు గుడే కోటేశ్వరరావు (36 సం.లు) మైనరు బాలికపై అత్యాచారంకు పాల్పడినట్లుగా నేరం రుజువు కావడంతో స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె. నాగమణి నిందితుడికి 20సం.లు కఠిన కారాగారం మరియు రూ. 2000/-ల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు. అదే విధంగా నిందితుడు అట్రాసిటీ చట్టం సెక్షన్ 3(1)(డబ్ల్యు)(1) ప్రకారం నేరంకు పాల్పడినందుకుగాను ఒక సంవత్సరం జైలు, రూ. 1000/- జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ ఎం. దీపిక తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసువారి తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటరు మావూరి శంకరరావు వాదనలు వినిపించగా, విజయనగరం ప్రస్తుత డిఎస్పీ ఆర్. గోవిందరావు పర్యవేక్షణలో కోర్టు ఎఎస్ఐ వి.సత్యం, సి.ఎం.ఎస్. హెచ్.సి. రామకృష్ణ సాక్షులను కోర్టులో హాజరుపర్చారన్నారు. నిందితుడు శిక్షలను ఏక కాలంలో అనుభవించాలని, తీర్పులో వెల్లడించారని జిల్లా ఎస్పీ ఎం. దీపిక తెలిపారు. పోక్సో కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్ష పడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను జిల్లా ఎస్పీ ఎం. దీపిక అభినందించారు.

ఘనంగా జరిగిన సుబ్బమ్మ పేరంటాలు పండుగ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని జోగమ్మ పేట గ్రామంలో గురువారంనాడు శ్రీశ్రీశ్రీ సుబ్బమ్మ పేరంటాలు పండుగను ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. సంక్రాంతి పండుగకు ముందువచ్చే గురువారం నాడు సుబ్బమ్మ పేరంటాలు పండుగ చేయడం ఎన్నో ఏళ్లుగాజరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. సుబ్బమ్మ పేరంటాల తల్లిఆశీస్సుల వల్లే గ్రామానికి మంచి జరుగుతుందని, అందరికీ ఆరోగ్యం బాగా ఉంటుందని తెలిపారు. ఉదయం పూట అమ్మవారి గటాలు మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి పూజలు చేశారు. కళ్యంపూడివారి ఇలవేల్పు, జోగంపేట గ్రామ ఆరాధ్యదైవం, భక్తుల పాలిట కల్పవల్లి, కోరిన కోర్కెలు తీర్చేతల్లి సుబ్బమ్మపేరంటాల తల్లని జోగమ్మపేట, అప్పయ్యపేట, ఇప్పలవలస, పాపమ్మవలస, గుచ్చిమి,సీతానగరం తదితర గ్రామాల ప్రజలు, భక్తులు తెలిపారు. సుబ్బమ్మ పేరంటాలు పండుగ వచ్చిందంటే సంక్రాంతి పండుగ వచ్చినట్లే నని ఇక్కడ ప్రజలు,భక్తులు తెలిపారు.ఇదిలా ఉండగా అమ్మవారికి చీరచూపించి, కొబ్బరికాయకొట్టి పూజలు నిర్వహించారు. సాయంత్రం నుండి రాత్రి వరకు పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి పూజలు నిర్వహించారు. స్థానిక పోలీస్ సిబ్బంది బందోబస్తును నిర్వహిం చారు. ఇదిలా ఉండగా టీడీపీ నియోజక వర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు, బొమ్మినాయుని లక్ష్మణరావు, టంకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టులు సమర్థవంతంగా పనిచేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం: జిల్లాల్లో ఉన్న చెక్ పోస్టులు సమర్థవంతంగా పనిచేయుటకు అన్నిచర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా కె ఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం జిల్లా కలెక్టర్ లతో పోలింగ్ కేంద్రాలలో మౌళిక సదుపాయాలు, ప్రాధాన్యతా భవనాలు, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు రానున్న తరుణంలో వాటి పనితీరుపై దృష్టి సారించాలన్నారు. అక్రమ రవాణా జరిగే అంశాల పట్ల దృష్టి సారించాలని ఆయన అన్నారు. పోలింగ్ కేంద్రాలు గల పాఠశాలలకు ర్యాంపులు ఉండేటట్లు చూడాలని, తాగునీరు ఇతర సౌకర్యాల లభ్యతను పరిశీలించాలని ఆయన ఆదేశించారు. పిఎం జన్ మాన్ కార్యక్రమం క్రింద సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు వద్ద సౌకర్యాలు కల్పనకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. 201 కేంద్రాలలో సౌకర్యాలు ముఖ్యంగా ర్యాంపులు, మరుగుదొడ్లు అవసరమని గుర్తించామని ఇప్పటికే వంద కేంద్రాలలో పూర్తి చేశామని, మిగిలిన వాటిలో ఈ నెల 25వ తేదీ నాటికి పూర్తి చేస్తామని వివరించారు. జిల్లాలో ప్రాధాన్యత భవనాలను వచ్చే పది రోజులలో గరిష్ఠంగా ప్రారంభించుట అన్ని చర్యలు చేపట్టామని తెలపారు. ఈవీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్. కృష్ణాజి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథ రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, గృహ నిర్మాణ సంస్థ ఇన్ ఛార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి రమేష్, జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎం ఎన్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశానికి వెన్నుముక

విశాలాంధ్ర-విజయనగరం: స్వామి వివేకానంద జన్మదినోత్సవం సందర్భంగా జాతీయ యువజన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పి ఛైర్మన్ కుమార్తె మజ్జి సిరి సహస్ర జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన దేశానికి యువతే వెన్నుముక అని ఆ నాడు స్వామీ వివేకానంద అన్నారని తెలిపారు. యువతకు ఆదర్శమన్నారు. ఇతరులకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలని పిలుపునిచ్చారు.నా తల్లి దండ్రుల ద్వారానే నేను ఇతరులకు సహకరించాలని నేర్చుకున్నామని తెలిపారు.. వారి స్ఫూర్తి తోనే చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థ ద్వారా సేవలంధిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సన్మానించారు.. ఈ సందర్భంగా సిరి సహస్రకు స్వచ్ఛంద సంస్థల సభ్యులందరు ఘనంగా సన్మానించారు .ఇంకా ఇలా ఎన్నో సేవా కార్యక్రామాలు చేయాలని ఆశీర్వదిస్తూ దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారి కే.రాజ్ కుమార్ ,చిన్న శ్రీను సోల్జర్స్ ఉప అధ్యక్షులు తోట వాసు,కార్యదర్శి జాకీర్ హుస్సేన్,శ్రీనివాస్, రామకృష్ణ, శివ,జగదీష్,సాయి,నవీన్ మరియు స్థానిక స్వచ్ఛంద సంస్థల సభ్యులు,చేయూత ఫౌండేషన్ సభ్యులు తదితర సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలు వైసీపీలో చేరికలు

విశాలాంధ్ర -పార్వతీపురం రూరల్: మండలంలో గల వెంకంపేట గ్రామం గ్రామ గ్రామాల్లో వలసలు రోజురోజుకి పెరుగుతున్నాయి పార్వతీపరం మండలం వెంకంపేట గ్రామంకు చెందిన 25 కుటుంబాలు స్థానిక పిఏసిఎస్ చైర్మన్ తీల శివున్నాయుడు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో వైయస్సార్ పార్టీలో చేరడం జరిగింది పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు స్థానికులు మాట్లాడుతూ పార్టీలకతీతంగా ఎప్పుడూ లేనివిధంగా ప్రస్తుత ఎమ్మెల్యే ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని బలుగు బలహీన వర్గాలని అక్కున చేర్చుకుని ఆదరిస్తున్నారని అన్నారు ఈకార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు జడ్పిటిసి ఎంపిటిసి సర్పంచులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మూర్ఖత్వపు ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

కిమిడి నాగార్జున

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మూర్ఖత్వపు ప్రభుత్వాన్ని గద్దె దింపాలని, జిల్లా బొబ్బిలిలో బుధవారం టిడిపి నిర్వహించిన రా కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టిడిపి జనసేన కార్యకర్తలకు నాయకులకు ప్రజలకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు జిల్లా టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున, విజయనగరం నియోజకవర్గ పార్లమెంట్ ఇంచార్జ్ అతిథి విజయలక్ష్మి. తెలిపారు గురువారం స్థానిక టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగార్జున మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఎన్నో సవాళ్లు ఎదుర్కొని నిర్వహించడం జరిగింది అన్నారు ప్రజలందరూ చంద్రబాబు కోసం వారి మాటలు వినడం కోసం ఎండన సైతం లెక్కచేయకుండా మండుటెండలో ఎదురు చూడటం జరిగిందన్నారు రెండు జనసేన టిడిపి కలయికలో ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు అన్నారు చంద్రబాబు ప్రసంగంలో ఎన్నో కొత్త విషయాలు చెప్పారన్నారు అందులో ప్రధానంగా భూ హక్కు చట్టం, భూ హక్కు పాస్ పుస్తకాలు, మహిళల కోసం, అదేవిధంగా జిల్లాలో ఉన్న గడిగడ్డ తోటపల్లి ప్రాజెక్టులు పరిస్థితి వివరించడం జరిగిందన్నారు ఈ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు చేసిన అభివృద్ధి ఏమీ లేదు కొత్తగా తీసుకువచ్చిన మౌలిక సదుపాయాలు కూడా ఏమీ లేవన్నారు కనీసం రిజర్వాయర్లకు మరమ్మత్తులు చేసుకోలేకపోతున్నారన్నారు. ప్రజలందరికీ రాబోయే రోజులన్నీ మంచివే అన్నారు. విజయనగరం నియోజకవర్గం ఇంచార్జ్ అతిథి గజపతిరాజు మాట్లాడుతూ యువగళం నిర్వహించిన కొద్ది రోజుల్లోనే బొబ్బిలి నియోజకవర్గం లో ఎంత భారీ సభను నిర్వహించడం దాన్ని విజయవంతం చేసుకోవడం ఎంతో సుభారిణామని అన్నారు ఈ కార్యక్రమంలో ఐవీపీ రాజు, బి నరసింగరావు , కంది మురళి ,ప్రసాదుల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అండతోనే అభివృద్ధిని చేయగలిగాం

మరొక్క అవకాశం ఇవ్వండి : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సామాన్యులకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఎవ్వరికి ఏ సమస్య వచ్చి తలుపు తట్టినా నెనున్నానని ధైర్యం చెప్పను కనుకనే మీ ముందు ధైర్యంగా మాట్లాడగలుగుతున్నానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. మీరిచ్చిన అధికారం తో మీ అండతోనే నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయగలిగానని తెలిపారు. గురువారం సారిపల్లి లో 352 కుటుంబాలకు టిడ్కో గృహాల తాళాలు అప్పగించే కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ పాల్గొన్నారు. లబ్ధిదా రులకు తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎం ఎల్ ఏ గా మరొక్క అవకాశం ఇస్తే సమస్యలు లేని విజయనగరాన్ని చూపిస్తానని, వచ్చే సారి యువత కు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా పని చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సహాయ మున్సిపల్ కమిషనర్ ప్రసాద రావు, టిడ్కో ఈ ఈ అరుణ, మేయర్ విజయలక్ష్మి, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు,హౌసింగ్ కమిటీ సభ్యులు ఎస్వీవీ రాజేష్, తవిటి రాజు, మారోజు శ్రీనివాసరావు, గాదం మురళి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సీతానగరం, బలిజిపేట మండలాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర

విశాలాంధ్ర-సీతానగరం/ బలిజిపేట: పార్వతీపురం మన్యం జిల్లాలో వికసిత భారత్ సంకల్ప యాత్ర ముమ్మరంగా సాగుతోంది. గురువారం సీతానగరం మండలంలోని జానుమల్లువలస, గాదెలవలస గ్రామాలలో, గరుగుబిల్లి మండలం చినగొడబ,వీరఘట్టంమండలం చిట్టిపూడి వలస,బలిజిపేట మండలంలో పెదపెంకి, తుమరాడ గ్రామపంచాయతీలలో జరిగింది. వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వివిధ విభాగాల నుండి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి సాధారణ వైద్య పరీక్షలు మాత్రమే కాకుండా క్షయ, సికిల్ సెల్ ఎనీమియా వంటి వాటిని గుర్తించుటకు వైద్య పరీక్షలు చేయడం జరుగుతోంది. ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజన క్రింద నమోదు, వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా స్థానికంగా ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాల్లో గెలుపొందిన మహిళలకు, విద్యార్థులకు, క్రీడాకారులకు, కళాకారులకు గ్రామ సభలలో భాగంగా సత్కరించారు. డ్రోన్ ప్రదర్శనలు, స్వయం సహాయక సంఘాల ప్రదర్శనలు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మంది రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు ఇందులో భాగంగా జరిగాయి. అయుష్మాన్ కార్డులను పంచాయతీలలో పంపిణీ చేశారు. వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు, మండల అధికారులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన సంక్రాంతి వారపు సంత...



విశాలాంధ్ర-కురుపాం : తెలుగు వారి సాంప్రదాయ పండుగలల్లో అత్యంత ముఖ్యమైన సంక్రాంతి ముందు వారపుసంత కావటంతో గురువారం కురుపాం పరిశర గ్రామాల ప్రజలతో కిటకిటలాడింది. ఏజన్సీప్రాంతంలో పండించిన పంటల్నీ వారపుసంతకు తీసుకుని వచ్చి అమ్మి పండుగకు అవసరంఅయిన గురువారం సందడి నెలకొంది.అసలే పాఠశాలలు,కాలేజీలకు సెలవులు ఇవ్వడంతో తల్లితండ్రులతో కలసి పిల్లలు వచ్చీ వారికి అవసరం అయిన బట్టలు ,నిత్యవసర సరుకుల్నీ కొనుగోలు చేసుకున్నారు.